
సాక్షి సంగారెడ్డి
మంగళవారం । 4 । మార్చి । 2025



వినూత్న ఆలోచన..
పంటలను కాపాడుకునేందుకు రైతులు వినూత్న ఆలోచనలు చేస్తున్నారు.
వివరాలు 8లో ▶



పారిశుద్ధ్యం అస్తవ్యస్తం
జిల్లా కేంద్రంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది.
వివరాలు 9లో ▶



న్యూస్‌రీల్

భావి శాస్త్రవేత్తలుగా తయారు కావాలి

• శాస్త్రవేత్త డాక్టర్ రఘు వర్మ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రఘువర్మ

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా తయారు కావాలని ఎన్‌ఆర్‌ఎస్‌సీ (నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్) రిటైడ్ జూనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రఘు వర్మ సూచించారు. సోమవారం మండల పరిధిలోని మిర్జాపూర్(బి)లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో రాకెట్ సైన్స్, టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రఘు వర్మ మాట్లాడుతూ.. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. విద్యార్థులు చేసే కృషికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఇస్రో చేసిన సేవలను గుర్తు చేస్తూ చంద్రయాన్-3 సాధించిన విజయంను దృశ్య రూపంలో విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజ్‌కుమార్‌తోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులు చేపట్టాలి

• మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంతోపాటు సంబంధిత రూట్లలో ఎన్‌హెచ్ 161బీ జాతీయ రహదారి మరమ్మతులు చేయకుంటే ఆందోళన చేపడుతామని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉండగా నిజాంపేట్-ఖేడ్- బీదర్ జాతీయ రహదారికి రూ.353 కోట్లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. ఈ నిధులతోనే ఖేడ్ పట్టణంతోపాటు అనుబంధ రోడ్లను కాంట్రాక్టర్ మరమ్మతులు చేయాల్సి ఉన్నా, పనుల్లో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. అధ్వానంగా మారిన రహదారులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. వెంటనే మర్మతులు చేపట్టాలని. లేని పక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ నర్సింహ్మా రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పరశురాం, మాజీ కౌన్సిలర్లు అభిషేక్ షెట్కార్, విఠల్, నగేశ్, ముజామ్మిల్, అంజాగౌడ్, సంగప్ప, మల్గొండ, మశ్చందర్ పాల్గొన్నారు.


కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలి

• సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు



పటాన్‌చెరు టౌన్/సంగారెడ్డి ఎడ్యుకేషన్: కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు పెంచాలని డిమాండ్ చేస్తూ త్వరలో ఉద్యమం చేయబోతున్నట్లు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు, కిర్బీ యూనియన్ అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. సోమవారం కిర్బీ కార్మికుల సమావేశంలో, అలాగే.. సంగారెడ్డి కలెక్టరేట్‌లో డిప్యూటీ లేబర్ కమీషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కనీస వేతనాలు పెంచలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పెంచకుండా మీనమేషాలు లెక్కిస్తుందని ఆరోపించారు. పెట్టుబడుదారులకు అనుకూలంగా మాత్రమే పాలకుల నిర్ణయాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఈ నెలలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

కేతకి ఆదాయం రూ.11.10 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సభ్యులు

ఝరాసంగం(జహీరాబాద్): మహాశివరాత్రి పురస్కరించుకొని శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయ ఆదాయాన్ని లెక్కించారు. సోమవారం ఆలయ ఆవరణలో శ్రీ రాజరాజేశ్వరి సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, లెక్కింపు ప్రారంభించారు. 13 రోజులలో రూ.11 లక్షల 70 వేల 698 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శివరుద్రప్ప, నాయకులు చంద్రశేఖర్, మల్లయ్య స్వామి, సంగారెడ్డి, ఆలయ అర్చకులు, అధికారులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గుక్కెడు నీటి కోసం గోస

నీటి ఎద్దడి@ 45 ఆవాసాలు



గుక్కెడు తాగునీటి కోసం ఇలా గుట్టలు ఎక్కుతున్న ఈ గిరిజన మహిళలది సిర్గాపూర్ మండలం దుగ్యానాయక్ తండా. సుమారు వంద వరకు కుటుంబాలు నివసించే ఈ తండాకు మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఈ తండావాసులే స్వయంగా సమీపంలో ఉన్న బావి లోంచి మోటార్ల ద్వారా తరలించుకుంటున్నారు. ఈ మోటార్లు కాలిపోయినప్పుడు ఇలా బిందెలతో సుమారు 200 మీటర్లు గుట్టలు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది.

• స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన 'భగీరథ' అధికారులు
• రాబోయే రోజుల్లో తాగునీటి సమస్య మరింత పెరిగే అవకాశం
• సింగూరులో నీళ్లున్నా.. సరఫరా వ్యవస్థలో లోపాలు
• తక్షణం స్పందించకుంటే సమస్య మరింత జటిలమయ్యే అవకాశం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: పైన పేర్కొన్న ఒక్క ఉదాహరణ చాలు జిల్లాలో తాగునీటి సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో అని చెప్పడానికి. ఇలా తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న దుగ్యానాయక్ తండా లాంటి నివాసిత ప్రాంతాలు జిల్లాలో సుమారు 45 వరకు ఉన్నాయి. ఇవన్నీ టెయిల్ ఎండ్ (తాగునీటి పథకాలకు చివర) ఉన్న గ్రామాలు. నివాసిత ప్రాంతాలు ఉన్నట్లు తేలింది. అయితే ఈ గ్రామాల్లో ప్రస్తుతం తాగునీటి సమస్య లేదని, వేసవిలో ఈ సమస్య తలెత్తే అవకాశాలు మాత్రమే ఉన్నాయని మిషన్‌భగీరథ అధికారులు పేర్కొంటున్నారు. ఈ వేసవిని దృష్టిలో పెట్టుకుని ఇటీవల జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని చెబుతున్నారు.

తాగునీటికి సరఫరా వ్యవస్థ సరిగ్గాలేక..

మిషన్‌భగీరథ అధికారికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 633 గ్రామ పంచాయతీల పరిధిలో 915 నివాసిత ప్రాంతాలు ఉన్నాయి. ఇప్పటి వరకు సుమారు 2.33 లక్షల ఇళ్లకు మిషన్‌భగీరథ నల్లా కనెక్షన్లు ఉన్నాయి. సింగూరు జలాశయం నుంచే జిల్లా అంతటికి తాగునీటి సరఫరా అవుతోంది. ఈ జలాశయంలో సమృద్ధిగా నీరుంది. కానీ తాగునీటి సరఫరా వ్యవస్థ ఇంకా పటిష్టం కాకపోవడంతో అనేక గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తుతోంది. భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఇచ్చామని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. తాగునీటి కోసం గ్రామాల్లోని బోర్ల నీటిని వాడకం తప్పనిసరిగా మారింది. ఆయా గ్రామ పంచాయతీల్లో బోరు మోటారు కాలిపోతే ఆ ప్రాంతమంతా అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న మండలాలివి..

జిల్లాలో కల్హేర్, సిర్గాపూర్, కంగ్టి, నాగల్‌గిద్ద, మానూరు, మొగుడంపల్లి, ఝరాసంఘం వంటి మారుమూల మండలాలతో పాటు, కొండాపూర్, కంది, అమీన్‌పూర్, ఆందోల్, హత్నూర, గుమ్మడిదల, జిన్నారం మండలాల్లోని టెయిల్ ఎండ్ గ్రామాల్లో తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఎండలు మరింత ముదిరితే ఈ గ్రామాల వాసుల నీటి కష్టాలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం

వేసవిలో తాగునీటి సమస్యల తలెత్తే అవకాశాలున్న గ్రామాలను గుర్తించాం. ఒకవేళ అక్కడ తాగునీటికి ఇబ్బందులు తలెత్తితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. ప్రస్తుతానికి జిల్లాలో తాగునీటి సమస్య లేదు. ఎక్కడైనా ఈ సమస్య ఎదురైతే టోల్‌ఫ్రీ నెం.1800 5994007కు ఫోన్ చేయవచ్చు. ఫోన్ చేసిన వెంటనే క్షేత్ర స్థాయికి వెళ్లి సమస్యను పరిష్కరిస్తాం.

: పాషా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ఖాళీ బిందెలతో నిరసన

సంగారెడ్డి: తమ కాలనీకి మంచినీళ్లు రావడంలేదని పట్టణంలోని మార్క్స్‌నగర్‌కు చెందిన మహిళలు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నెల రోజులుగా కాలనీలో తాగడానికి, నిత్యావసరాలకు నీరు రాకపోవడంతో ఇతరుల ఇళ్లకు వెళ్లి రోజు నీటిని అడుక్కొని తీసుకొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌కు మాజీ కౌన్సిలర్ గోవర్ధన్ నాయక్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

బాబోయ్.. భగీరథ

• రంగు మారిన తాగునీరు
• కలుషిత నీటి సరఫరాతో జనం బెంబేలు



వెంకటాపూర్‌లో పచ్చగా వస్తున్న భగీరథ నీరు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మిషన్ భగీరథ కింద కలుషిత నీరు సరఫరా అవుతుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సదాశివపేట పట్టణం, మండల పరిధిలో వారం రోజులుగా ఈ పరిస్థితి నెలకొంది. మునిపల్లి మండలం బూసరెడ్డిపేట వాటర్ ప్లాంట్ నుంచి ఈ గ్రామాలకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తారు. సదాశివపేట సహా మండల పరిధిలోని 20 గ్రామాలకు కలుషిత నీరు సరఫరా అవుతోంది. నల్లాల్లో పచ్చని, ఎర్రటి రంగుల్లో తాగునీరు సరఫరా అవుతుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. బిందెలు, బకెట్ అడుగున ఎర్రటి బురద పేరుకుపోతుంది. కలుషిత నీరు తాగితే ఎలాంటి వ్యాధులు సోకుతాయోనని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కలుషిత నీరు సరఫరా కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై వివరణ కోరేందుకు మిషన్ భగీరథ ఏఈని పలుమార్లు ఫోన్లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

జిల్లా కలెక్టర్ క్రాంతి • అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

సంగారెడ్డి జోన్: గ్రామాలలో సాగు, తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాగు, తాగు నీరు ఇబ్బందులు ఏర్పడే జిల్లాలలో మండలాల వారీగా తహసీల్దార్, నీటిపారుదల శాఖ ఇంజనీర్, వ్యవసాయ అధికారితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా పర్యటించాలన్నారు. గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలలను రెగ్యులర్‌గా చెక్ చేయాలన్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో సంక్షేమ హాస్టళ్లను తనిఖీ చేసేందుకు టాస్క్ ఫోర్స్ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. రాబోయే 10 రోజులపాటు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులతో సంప్రదింపులు జరపాలని చెప్పారు. సమావేశంలో అడిషనల్ కలెక్టరు మాధూరి, ట్రైనీ కలెక్టరు మనోజ్, ఎలక్ట్రిసిటీ, వ్యవసాయ, ఇరిగేషన్, సంబంధిత అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరైన కలెక్టర్, ఇతర అధికారులు

లోక్‌అదాలత్‌పై అవగాహన

ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి జోన్: పెండింగ్‌లో ఉన్న కేసులలో ఇరువర్గాలు రాజీపడేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్‌హెచ్‌ఓలకు ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆదేశించారు. సోమవారం పోలీసు కార్యాలయం నుంచి జిల్లాలోని వివిధ పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కానిస్టేబుల్ నుంచి అధికారుల వరకు వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ పడేలా చూడాలన్నారు. ఈ నెల 8వ తేదీన లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని చెప్పారు. సైబర్ నేరాలకు సంబంధించి బాధితులు కోల్పోయిన/ హోల్డ్ చేయబడిన డబ్బు తిరిగి బాధితులకు చేరే విధంగా సంబంధిత బ్యాంక్ అధికారులకు కోర్టు ద్వారా ఉత్తర్వులు అందించాలని సూచించారు. ఇ-పెట్టి కేసులు, మద్యం తాగి పట్టుబడిన కేసులలో విధించిన జరిమానా డబ్బులు చెల్లించే విధంగా చూడాలని అన్నారు. క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవడానికి లోక్-అదాలత్ అనేది ఒక మంచి అవకాశమని, అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోకూడదని సూచించారు. అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావ్, సైబర్ క్రైమ్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి, కోర్టు లైజనింగ్ అధికారి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

నేడు డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

నారాయణఖేడ్: ఖేడ్ మండలం జూకల్ శివారులోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో మంగళవారం న్యూల్యాండ్‌ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.నారాయణ తెలిపారు. ఇంటర్మీడియెట్ పూర్తయిన, డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మేళాలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పదోతరగతి, ఇంటర్మీడియెట్ మెమోలు, ఆధార్ కార్డు, నాలుగు పాస్ పోర్టుసైజు ఫోటోలు తీసుకుని రావాలని సూచించారు.

ప్రజావాణిలో 37 అర్జీలు

సంగారెడ్డి జోన్: తమ సమస్యలు పరిష్కరించాలని ప్రజావాణిలో ప్రజలు అర్జీలు పెట్టుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవించుకున్నారు. ఈ మేరకు 37 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీసీఈఓ జానకి రెడ్డి, సివిల్ సప్లై అధికారి రాజేశ్వర్, డీపీఓ సాయిబాబా, కలెక్టరేట్ ఏవో పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో అవకతవకలు

• సామాజిక తనిఖీ బృందం పరిశీలనలో వెలుగులోకి..
• ఆరుగురు ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిమాన

హత్నూర (సంగారెడ్డి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సామాజిక తనిఖీ బృందం పరిశీలించింది. పనుల్లో అనేక అవకతవకలు జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. సోమవారం హత్నూర రైతువేదికలో బహిరంగ విచారణ చేపట్టారు. 2023-24 సంవత్సరంలో మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో చేపట్టిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై వారం రోజులుగా క్షేత్రస్థాయి విచారణ చేపట్టింది. అక్కడ సోషల్ ఆడిట్ బృందం గుర్తించిన లోటుపాట్లు, అక్రమాలను బహిరంగ ప్రజావేదిక దృష్టికి తీసుకొచ్చింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మొక్కల పెంపకం లోపభూయిష్టంగా ఉన్నట్లు గుర్తించింది. అనేక గ్రామాలలో పెట్టిన మొక్కలు సంరక్షించడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు విఫలమైనట్లు వివరించింది. అంతేకాకుండా, మెజార్టీ గ్రామాలలో మస్టర్ల నిర్వహణ సక్రమంగా లేదని పేర్కొంది. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని బృందం సభ్యులు హెచ్చరించారు. ఇదిలా ఉండగా క్షేత్రస్థాయి పరిశీలన చేయడంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్న ఆరుగురు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున జరిమాన వేస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొసీడింగ్ ఆఫీసర్ బాలరాజ్, డీవీవో నాగేశ్వరరావు. ఎంపీడీవో శంకర్, ఎస్ఆర్పీ కవిత, ఏపీవో ప్రవీణ్ కుమార్ ,గ్రామ పంచాయతీ కార్యదర్శులు ,ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పోక్సో కేసులో జీవితఖైదు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి కోర్టు జీవిత ఖైదు విధించిన ఘటన తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. కొల్లూరు పోలీసుల కథనం ప్రకారం.. గతేడాది మే నెలలో తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ప్రాంతంలో ఉంటున్న మీర్జా అక్బర్ బేగ్ అదే ప్రాంతంలో ఉండే బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఇన్‌స్పెక్టర్ రవీందర్, కోర్టు కానిస్టేబ్లు నర్సింహులు, శ్రీకాంత్, ఏఎస్ఐ రవీందర్ రెడ్డి సాక్ష్యాధారాలు సేకరించి కోర్టు ముందు ఉంచారు. సోమవారం కేసును విచారించిన ఫస్ట్ అదనపు డిస్ట్రిక్ సెషన్స్ న్యాయమూర్తి కె.జయంతి నిందితుడు మీర్జా అక్బర్ బేగ్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.5వేల జరిమానా విధించారు. నిందితుడికి శిక్ష పడేలా చేసినరవీందర్‌ను, పోలీస్ సిబ్బందిని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, మాదాపూర్ డీసీపీ డాక్టర్. జి.వినీత్, మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ రావు అభినందించారు.

సర్వం సిద్ధం

• రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు
• సీసీ కెమెరాల పర్యవేక్షణలో..
• ఉదయం 9 నుంచి 12 గంటల వరకు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఈనెల 5 నుంచి 25వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహిస్తామని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి గోవింద్‌రాం తెలిపారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో సోమవారం ఆయన పరీక్షలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా విద్యుత్, రవాణా, వైద్య అధికారులతో సమీక్షించామని తెలిపారు.

జిల్లాలో 54 పరీక్ష కేంద్రాలు

జిల్లాలో 54 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 34,614 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం 16,513. ద్వితీయ సంవత్సరం 18,101 మంది విద్యార్థులు ఉన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు హాల్ టికెట్ ఇవ్వకుంటే tgbie.cgg.gov.in అనే వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, హాల్ టికెట్‌పై సంబంధిత ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని తెలిపారు.

నిమిషం నిబంధన లేదు, కానీ..

గతంలో ఉన్న నిమిషం నిబంధన ఎత్తివేసినప్పటికీ ప్రస్తుతం ప్రతి విద్యార్థి 15 నిమిషాల ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. పరీక్ష కేంద్రాన్ని తెలుసుకోవడానికి ఇబ్బందులు ఉంటే హాల్ టికెట్ వెనుక క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సెంటర్ లొకేషన్ చూపిస్తుంది. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ప్రతి పరీక్ష కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసి ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులు తమ వెంట ఎటువంటి చేతి వాచీలు, ఎలక్ట్రిక్ పరికరాలను అనుమతించేది లేదని ఇంటర్మీడియెట్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా రాసేలా జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రతి పరీక్ష కేంద్రంలోనూ సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే ప్రశ్నపత్రాన్ని ఓపెన్ చేస్తాం. ప్రతి సీసీ కెమెరా కూడా ఇంటర్మీడియెట్ రాష్ట్ర శాఖకు అనుసంధానంగా ఉంటుంది. 8:45 గంటలు దాటితే పరీక్ష కేంద్రంలోకి అనుమతించం.

: గోవింద్‌రాం, ఇంటర్మీడియెట్ అధికారి



వివరాలను వెల్లడిస్తున్న జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి గోవిందరాం తదితరులు

వివరాలు..

పరీక్ష కేంద్రాలు	54	డీఈఓ మెంబర్‌లు	03
ప్రథమ సంవత్సరం విద్యార్థులు	16,513	ప్రశ్నపత్రం బల్క్ ఇన్‌చార్జి	01
ద్వితీయ సంవత్సరం విద్యార్థులు	18,101	సీఎస్‌లు	54
		డీఎస్‌లు	54
స్టోరేజీ పాయింట్లు	19	ఫ్లయింగ్ స్క్వాడ్	03 బృందాలు
ఇన్విజిలేటర్లు	926	సిట్టింగ్ స్క్వాడ్	04 బృందాలు

క్లుప్తంగా

సెల్‌ఫోన్ విషయంలో గొడవ

ఇంటి నుంచి వెళ్లి వివాహిత అదృశ్యం


పవిత్ర

శివ్వంపేట(నర్సాపూర్): వివాహిత అదృశ్యమైన ఘటన మండల పరిధి తిమ్మాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన గొల్ల నాగరాజుతో కొల్చారం మండలం కృష్ణాపూర్ గ్రామానికి చెందిన పవిత్రకి 7 నెలల కిందట వివాహం జరిగింది. పుట్టింటి నుంచి పవిత్ర సెల్‌ఫోన్ తెచ్చుకోవడంతో ఆదివారం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అనంతరం నాగరాజు పనికి వెళ్లిపోయి సాయంత్రం వచ్చేసరికి భార్య ఇంట్లో కనిపించలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య అదృశ్యంపై నాగరాజు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెళ్లికొచ్చి వృద్ధుడు అదృశ్యం

జిన్నారం (పటాన్‌చెరు): వృద్ధుడు అదృశ్యమైన ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మాదారం గ్రామ శివారులో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం శివారులోని కొలన్ హనుమంత రెడ్డి ఫంక్షన్ హాల్‌లో 2న ఓ వివాహ కార్యక్రమం జరిగింది. ఈ వివాహానికి సాయిరెడ్డి (62) కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. పెళ్లయిన అనంతరం అతడు ఫంక్షన్ హాల్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం గాలించినా ఫలితం దక్కలేదు. బాధితుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడి కేసులో నిందితుల అరెస్టు


నిందితులతో పోలీసులు

జహీరాబాద్: మట్టిని తరలిస్తున్న వారిని ప్రశ్నించినందుకు గ్రామస్తులపై దాడి చేసిన కేసులో సోమవారం నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఫిబ్రవరి 28 రాత్రి 12 గంటల ప్రాంతంలో కోహీర్ మండలంలోని మదిరి గ్రామ శివారులోని వక్ఫ్ భూమిలో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వహీద్ అలీ, వహీద్, ఫాహద్, ఫిరోజ్‌లను మదిరి గ్రామానికి చెందిన వారు ప్రశ్నించారు. దీంతో వారు గ్రామస్తులపై దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అనంతరం విచారణ జరిపి నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు.

కూతురి వివాహానికి డబ్బులు అందడం లేదని

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మనోహరాబాద్(తూప్రాన్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. మనోహరాబాద్ మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామానికి చెందిన పిట్ల రాజు (44) కూలీ పనులు చేసుకుంటూ రాజుకు భార్య, ఇద్దరు కూతుళ్లతో జీవిస్తున్నాడు. రాజు నూతనంగా ఇల్లు నిర్మించగా అప్పులయ్యాయని, నెల రోజుల కిందట పెద్ద కూతురు వివాహం నిశ్చయమైంది. కూతురి పెళ్లికి డబ్బులు పుట్టకపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన రాజు సాయంత్రమైన రాకపోవడంతో చుట్టుపక్కల వెతకగా శివారులో చెట్టుకు డ్రిప్‌పైపుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న కుమారుడు పిట్ల సదేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌కు నిప్పు

సంగారెడ్డి క్రైమ్: ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్‌కు గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. ఈ ఘటన సంగారెడ్డి పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీకి చెందిన పట్నం అరుణ వాణి గృహిణి. 2న రాత్రి రెండు గంటల సమయంలో బయటకొచ్చి చూడగా ఇంటి ఎదుట పార్కు చేసిన తన కుమారుడి బైక్ కాలిపోయి ఉంది. గుర్తు తెలియని దుండగులు బైక్‌కు నిప్పంటించారని ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వినూత్న ఆలోచన.. పంటకు రక్షణ


పంట చుట్టూ ఏర్పాటు చేసిన పాత చీరలు

పంటలపై జంతు జీవాలు దాడి

- కాపాడుకునేందుకు రైతుల కొత్త ఆలోచన
- పొలాల చుట్టూ పాత చీరలు ఏర్పాటు
- పాలిథిన్ కవర్లు, ఖాళీ సీసాలు వినియోగం
- సంరక్షణ చర్యలతో సత్ఫలితాలు

సంగారెడ్డి జోన్: రైతులు వ్యవసాయం చేయాలంటే ఎన్నో కష్ట నష్టాలను ఎదుర్కోవాలి. విత్తనం వేసిన నాటి నుంచి పంట చేతికొచ్చేంత వరకు రైతులు నానా రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. పంటలపై పశువులతోపాటు జంతు జీవాలు దాడులు చేస్తున్నాయి. పంటలను ఏ విధంగానైనా రక్షించుకోవాలని లక్ష్యంతో తమకు తోచిన ఆలోచనను అమలు చేసి కొంతమేర రక్షించుకోగలుగుతున్నారు. సులభమైన పలు పరిష్కార మార్గాలను కనుగొంటున్నారు. పంటల చుట్టూ చీరలు, పాలిథిన్ కవర్లు, ఖాళీ సీసాలు ఏర్పాటు చేసుకొని కంటి రెప్పలా కాపాడుకుంటున్నారు.

జిల్లాలో యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు వినూత్న ఆలోచనలు చేస్తున్నారు. పక్షులతోపాటు అడవి పందులు, కోతులు, కుందేళ్లు పంటలపై దాడులు చేస్తున్నాయి. జిల్లాలోని ఝరాసంగం, న్యాల్‌కల్, జహీరాబాద్, మునిపల్లి, రాయికోడ్, కోహీర్ తదితర మండలాల్లో నీటి సౌకర్యం ఉన్న రైతులు జొన్న, మొక్కజొన్న, శనగ, చెరుకు పంటలను సాగు చేస్తుంటారు.

పాత వస్తువులతో కొత్త ఐడియాలు

జిల్లాలో ముఖ్యంగా సాగులో ఉన్న జొన్న, మొక్కజొన్న, చెరుకు, శనగ, బొప్పాయి పంటలపై దాడి చేస్తున్నాయి. ప్రస్తుతం ఆయా పంటలు లేత దశలో ఉండటంతో వాటిని తినేందుకు వస్తుంటాయి. కంకులను తిన్న తర్వాత మిగితా వాటిని నాశనం చేస్తున్నాయి. ఈ తరుణంలో రైతులు పంటలను కాపాడుకోవడానికి వివిధ రకాల పద్ధతులను ఉపయోగిస్తున్నారు. పాత చీరలతో పంట చుట్టూ కంచె మాదిరిగా ఏర్పాటు చేసుకొని అడవి పందుల బెడద నుంచి కాపాడుకుంటున్నారు. ఖాళీ బీరు సీసాలతో పొలం గట్లపై ఉన్న చెట్లకు వేలాడదీస్తున్నారు. గాలులు వీచిన సమయంలో సీసాలతో వచ్చిన చప్పుడుతో పక్షులు బెదిరిపోతున్నాయి.


చెట్టుకు వేలాడదీసిన ఖాళీ సీసాలు

రైతుల సరికొత్త ఆలోచనలు

పంటలు సాగు చేసే రైతులు పక్షులు, జంతువులు దాడి చేస్తుండడంతో అధైర్య పడకుండా తమకు వచ్చిన వినూత్న ఆలోచనలతో పంటలను కాపాడుకుంటున్నారు. ఎవరిపై ఆధారపడకుండా పంటలను రక్షించుకుంటూ దిగుబడులు పొందుతున్నారు. రైతులు అమలు చేసే చిరు ప్రయత్నాలు మంచి సత్ఫలితాలు ఇస్తున్నాయని చెబుతున్నారు.

పాలిథిన్ కవర్లు, సౌండ్ రికార్డులు

పర్యావరణానికి ముప్పుగా ఉన్న పాలిథిన్ కవర్లు పంట రక్షణకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. విత్తనం వేసిన చెరుకు పంటతోపాటు వివిధ రకాల పంట పొలాల మధ్యలో కర్రలను ఏర్పాటు చేసి వాటికి ప్లాస్టిక్ కవర్లను కట్టుతున్నారు. గాలివీచిన సమయంలో వచ్చే చప్పుళ్లతో పక్షులతోపాటు జంతువులు పరారవుతున్నాయి. మెమొరీ కార్డు, ఛార్జింగ్, సౌండ్ రికార్డింగ్ కలిగి ఉన్న బాక్స్‌లను వినియోగిస్తున్నారు. ఫలితంగా రాత్రుల సమయంలో పక్షుల బెడద తగ్గిందంటున్నారు. అంతే కాకుండా వాహనాలకు వినియోగించే ఇంజన్ ఆయిల్ వాడిన తర్వాత ఆయుర్వేద మందులు కలిపి పంట చుట్టూ చీరతో కట్టడంతో అడవి పందుల బెడద తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. ప్లాస్టిక్ వాటర్ డబ్బాలు తాడుతో చుట్టి పంట చుట్టూ కడుతున్నారు. ఈ విధంగా పంటలను కొంతమేర రక్షించుకోగలుగుతున్నామని రైతులు పేర్కొంటున్నారు.


బొప్పాయి తోటలో ఏర్పాటు చేసిన పాలిథిన్ కవర్లు

ఎండిన పంటలకు పరిహారం అందించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి


ఎండిన పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కొముురవెల్లి(సిద్దిపేట): యాసంగిలో ఎండిన వరి పంటకు ప్రభుత్వం రైతులకు పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని లెనిన్‌నగర్ గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ఎండిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొముురవెల్లి మండలంలో కరువు కాటకాలను దూరం చేసేందుకు తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నిర్మించారని అన్నారు. ప్రతీ సంవత్సరం తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి ఈప్రాంత చెరువులను నింపి రైతులకు సాగు నీరు అందించే వారని దీంతో భూగర్భజలాలు పెరుగడంతో బోరు బావులలో పుష్కలంగా నీరు ఉండేదని అన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వం రియర్వాయర్‌లోకి నీరు విడుదల చేయకపోవడంతో నీరు లేక పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిన పంటలు ఎకరాకు రూ.50 వేలు పరిహారంగా అందించాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి, మండల కార్యదర్శి తాడూరి రవీందర్, దాసరి ప్రశాంత్, దాసరి చక్రపాణి పాల్గొన్నారు.

పిల్లలకు వినికిడి పరీక్షలు నిర్వహించాలి

సిద్దిపేట ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి


మాట్లాడుతున్న డాక్టర్ నాగరాజు

సిద్దిపేటకమాన్: మూడేళ్ల వరకు ఉన్న చిన్న పిల్లలకు తప్పకుండా వినికిడి పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి, ఈఎన్‌టీ విభాగ హెచ్ఓడీ కే.నాగరాజు తెలిపారు. జాతీయ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సోమవారం ఈఎన్‌టీ విభాగ వైద్యుడు డాక్టర్ కడవేర్గు ప్రణీత్‌తో కలిసి డాక్టర్ శాంతి, డాక్టర్ నాగరాజు మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రిలో డెలివరీ అయిన బాలింతలకు, పిల్లల తల్లిదండ్రులకు వినికిడి సమస్యలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతీ బేబీకి డిశ్చార్జీకి ముందు తప్పకుండా ఈఎన్‌టీ విభాగ వైద్యులతో వినికిడి పరీక్షలు నిర్వహించాలన్నారు. పిల్లలకు వినికిడి సమస్య ఉంటే భవిష్యత్‌లో వారికి మాటలు కూడా సరిగా రాకపోవడానికి అవకాశం ఉంటుందన్నారు. నెలలు నిండకుండా, బరువు తక్కువగా జన్మించిన పిల్లలకు తప్పకుండా వినికిడి పరీక్షలు చేయించి, ఏదైనా సమస్య ఉంటే చికిత్స తీసుకోవాలని తెలిపారు. ఫ్లకార్డులతో వైద్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చందర్, ఆర్ఎంలు డాక్టర్ జ్యోతి, డాక్టర్ శ్రావణి, డాక్టర్ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం

అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ఘటన

పటాన్‌చెరు టౌన్: అప్పుల బాధతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ కాలనీకి చెందిన శ్రీనివాస్ రెడ్డి (34) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. భార్య గర్భిణి కావడంతో పుట్టింటి వద్ద ఉంటుంది. కొంతకాలంగా శ్రీనివాస్‌రెడ్డి ఆర్థిక ఇబ్బందులతో సుమారు రూ.10 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పుల బాధ తాళలేక సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య వాసవి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో ఇంటికి సమీపంలో ఉన్న ఆమె చెల్లెలు సాయి చందనకు ఫోన్ చేసి చెప్పింది. వెంటనే ఆమె ఇంటికి వెళ్లి కిటికీలోంచి చూడగా బావ శ్రీనివాస్ రెడ్డి ఉరేసుకొని కనిపించాడు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి మరదలు సాయి చందన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ దుర్గయ్య కేసు నమోదు చేశారు.

మిత్రుడి వివాహానికి వచ్చి వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మరో యువకుడికి తీవ్ర గాయాలు

నర్సాపూర్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ లింగం కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన సాయి నిఖిల్(21), అతడి మిత్రుడు మనీశ్ ఆదివారం మెదక్‌లో జరిగిన వారి మిత్రుడి వివాహానికి హాజరయ్యారు. రాత్రి ఇంటికి తిరిగి ప్రయణమయ్యారు. నర్సాపూర్ మీదుగా హైదరాబాద్ వెళ్తుండగా నర్సాపూర్ శివారులోని అయ్యప్ప దేవాలయం సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న రెయిలింగ్‌కు బైక్ ఢీకొట్టంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న నిఖిల్ అక్కడికక్కడే మృతి చెందగా వెనుక కూర్చున్న మనీశ్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అనంతరం మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి తరలించారు. బైక్‌ను అతివేగంగా అజాగ్రత్తగా నడిపినందునే అదుపుతప్పి ప్రమాదం జరిగిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

బైక్ ఢీకొని వృద్ధుడు

కొండపాక(గజ్వేల్): బైక్ ఢీకొట్టడంతో వృద్ధుడు మృతి చెందిన ఘటన కొండపాకలో చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామానికి చెందిన తోడేటి పెంటయ్య(60) సమీప గ్రామమైన మేదినీపూర్‌లో జరిగిన వివాహానికి హాజరయ్యాడు. సాయంత్రం వేళ కొండపాకలోని అత్తారింటికి నడుచుకుంటూ వెళ్తుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వెళ్తున్న బైక్ తిమ్మారెడ్డిపల్లి శివారులో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కోరుట్లకు చెందిన వినోద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.


పెంటయ్య

చేపల వేటకు వెళ్లి వ్యక్తి


సాయికుమార్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బిజ్జిపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుకర్ రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన నెల్లూరి సాయికుమార్(35) శనివారం రాత్రి మద్యం మత్తులో చేపల వేటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆదివారం గ్రామ పరిసరాల్లోని చెరువులు, కుంటల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం గ్రామ శివారులోని వీరప్ప చెరువు లో సాయి కుమార్ మృతదేహం తేలడంతో గుర్తించారు. చేపల వేటకు వెళ్లి నీట మునిగి మృతి చెందినట్లు మృతుడి చెల్లి శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

కల్వర్టును ఢీకొట్టిన పెళ్లి బృందం బస్సు

ఇద్దరికి తీవ్ర, మరో ముగ్గురికి స్వల్ప గాయాలు


కల్వర్టును ఢీకొట్టిన బస్సు

పటాన్‌చెరు టౌన్: పెళ్లి బృందం బస్సు కల్వర్టును ఢీకొట్టడంతో ఐదుగురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సోమవారం సంగారెడ్డి వైపు నుంచి హైదరాబాద్ బోయిన్‌పల్లికి పెళ్లి బృందం బస్సు వెళ్తుంది. రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోకి రాగానే జాతీయ రహదారి పక్కన ఉన్న కల్వర్టును రాత్రి ఢీకొట్టింది. బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

అదృశ్యమైన యువకుడు శవమై లభ్యం

మరో 20 రోజుల్లో మృతుడి వివాహం

న్యాల్‌కల్(జహీరాబాద్): అదృశ్యమైన యువకుడు శవమై కనిపించిన ఘటన మండల పరిధిలోని హుమ్నాపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్ఐ చల్లా రాజశేఖర్ కథనం మేరకు.. నాగులగిద్ద మండలం గంగారం తండాకు చెందిన సునీల్ చౌహన్ హైదరాబాద్‌లో ఉంటూ కొంతకాలంగా పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం కోసం పిట్లంలోని ఆస్పత్రికి వస్తున్నానని, అనంతరం ఇంటికొస్తానని 1వ తేదీన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. ఇంటికొస్తానన్న కుమారుడు రాకపోయే సరికి ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పలుమార్లు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆదివారం సునీల్ వాహనం పుల్కుర్తి బ్రిడ్జిపై పోలీసులకు లభించిన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని గాలింపు చేపట్టగా సోమవారం ఉదయం మంజీరా నదిలో శవమై కనిపించాడు. కుమారుడి మృతిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.


పడవల ద్వారా మృతదేహాన్ని తీసుకొస్తూ..

ఆస్తి కోసం కన్నతల్లిని కడతేర్చిన కొడుకు

- మద్యం మత్తులో కత్తితో దాడి
- మృతురాలి శరీరంపై ఆరు కత్తిపోట్లు
- సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఘటన


మృతురాలు రాధిక (ఫైల్)


నిందితుడు కార్తీక్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆస్తి కోసం కన్నతల్లినే కడతేర్చాడు ఓ కసాయి కొడుకు. మద్యం మత్తులో కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. రక్తపు మడుగులో పడి ఉన్న ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ దారుణ ఘటన సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని డివినో విలాస్‌లో నివాసముండే నవారి రాధిక(52), భర్త మాల్లారెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సందీప్ రెడ్డికి గతేడాది వివాహం జరిగింది. రెండో కుమారుడు కార్తీక్ రెడ్డి మద్యానికి బానిసయ్యాడు. కొంత కాలంగా తనకు రావాల్సిన ఆస్తిని పంచితే తాను వ్యాపారం చేసుకుంటానని నిత్యం తల్లిదండ్రులతో గొడవ పడేవాడు. మద్యానికి బానిస కావడంతో కార్తీక్ రెడ్డిని గతేడాది రెండు సార్లు రియబ్‌టేషన్ సెంటర్‌కు పంపించారు. జనవరి నెలలో తిరిగి ఇంటికొచ్చాడు. మళ్లీ ఆస్తి విషయంపై గొడవ పడుతూ వస్తున్నాడు. కార్తీక్ రెడ్డి ఆదివారం రాత్రి మద్యం సేవించి ఇంటికొచ్చాడు. సోమవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో ఇంట్లో తనకు ఆస్తి పంచాలని పెద్దపెద్దగా అరవడం మొదలుపెట్టాడు. తల్లి రాధిక నిద్రలేచి ఏమైందంటూ అనడంతో ఆమెపై కత్తితో దాడి చేశాడు. తండ్రి మల్లారెడ్డి అడ్డుకునేందుకు ప్రయత్నించగా అతడిపై దాడి చేశాడు. వెంటనే అతడు బయటకు పరిగెత్తి కాపాడాలంటూ గట్టిగా కేకలేశాడు. సందీప్ రెడ్డి సైతం భయంతో బయటకు వచ్చి తల్లిని కాపాడాలంటూ కేకలేశాడు. అందరూ కలిసి లోనికి వెళ్లి చూడగా రాధిక రక్తం మడుగులో పడి ఉంది. వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఉదయం 10 గంటల సమయంలో మృతి చెందింది. సమాచారం అందుకున్న కొల్లూరు ఎస్ఐ రవీందర్, మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి శరీరంపై ఆరు కత్తిపోట్లు ఉన్నట్లు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు కార్తీక్ రెడ్డిని సోమవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పోలీసులతో దురుసు ప్రవర్తన

వ్యక్తి కేసు నమోదు

నర్సాపూర్: విధి నిర్వహణలో ఉన్న ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లతో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మూసాపేట గ్రామానికి చెందిన ప్రవీన్ 100 నబంర్‌కు ఫోన్ చేసి తన అక్క రేణుకను బావ సురేశ్ కొడుతున్నాడని ఫిర్యాదు చేశాడు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు మోహన్, భిక్షపతి గ్రామానికి వెళ్లి సురేశ్‌కు నచ్చజెప్పేందుకు ప్రయత్నించగా అతడు పోలీసులను ఇష్టం వచ్చినట్లు బూతులు తిడుతూ వారి చొక్కాలు పట్టుకొని కొట్లాటకు దిగాడు. తమ కుటుంబం జోలికి వస్తే చంపేస్తానని బెదిరించాడు. ఈ విషయాన్ని తెలుసుకొని పెట్రోలింగ్ డ్యూటీ చేస్తున్న ఏఎస్ఐ క్రిష్ణ గ్రామానికి వెళ్లగా సురేశ్ ఏఎస్ఐని సైతం తిట్టాడని ఎస్ఐ పేర్కొన్నారు. తమ విధులకు ఆటంకం కలిగించి దురుసుగా ప్రవర్తించినందుకు కానిస్టేబుళ్లు మోహన్, భిక్షపతిల ఫిర్యాదు మేరకు సురేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు లింగం వివరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పటాన్‌చెరు టౌన్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఏపీలోని శ్రీకాకుళం జిల్లా సీతారామపురం గ్రామానికి చెందిన నీలకంఠేశ్వర రావు(30) ఏడాది కిందట బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో ఉంటున్నాడు. ఇక్కడే ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. 2న రాత్రి డ్యూటీ ముగించుకొని ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. సుల్తాన్‌పూర్ గ్రామ సమీపంలోని కల్యాణ్ వెంచర్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి స్పీడ్ బ్రేకర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం తరలించగా సోమవారం మృతి చెందాడు. మృతుడి పెద్దనాన్న కుమారుడు సోమేశ్వర రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దుర్గయ్య తెలిపారు.

ప్రైవేట్ హాస్పిటల్స్‌పై చర్యలు తీసుకోండి


ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రజల జీవితాలతో చెలగాట మాడుతున్న ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సంగారెడ్డిలోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రిని ఆశ్రయిస్తూ ప్రాణాలు కోల్పోతున్నా జిల్లా వైద్యాధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపంచారు. వారం రోజుల వ్యవధిలో ప్రైవేట్ హాస్పిటల్లో వైద్యం చేయించుకుంటూ ఇద్దరు మృత్యువాత పడటం చాలా బాధాకరమన్నారు. విచ్చలవిడిగా పెరుగుతున్న ప్రైవేటు హాస్పిటల్స్ కనీస సౌకర్యాలు లేకుండా, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా రోగులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. జిల్లా కేంద్రంలో చాలా ఆస్పత్రిల్లో అర్హత లేని డాక్టర్లు, సిబ్బందితో పని చేయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, తక్షణమే అధికారులు స్పందించి ప్రైవేట్ హాస్పిటల్స్‌పై కఠిన చర్యలు తీసుకొని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి,కృష్ణ, నాయకులు రమేష్ మల్లేశం, అర్జున్ పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



పిచరాగడి పాఠశాలలో..

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండలంలోని తాడ్మన్నూర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులు వ్యవహరించి అలరించారు. ప్రధానోపాధ్యాయులుగా అక్షిత, డీఈఓగా దుర్గారాజ్, ఎంఈఓగా శ్రీహరి, కలెక్టర్‌గా చరణ్, ఉపాధ్యాయులుగా భవాని, వైష్ణవి, భానుప్రియ, భార్గవి, రేణుక, రఘువర్ధన్, వినయ్, రఘు, దీక్షిత్, అశ్విన్, శ్రీహితలు వ్యవహరించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు గీత, మల్లేశ్వరి, వినోద, క్రిష్ణారెడ్డి, అఖిల పాల్గొన్నారు.

పిచరాగడి ప్రభుత్వ పాఠశాలలో..

జహీరాబాద్: కోహీర్ మండలంలోని పిచరాగడి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సోమవారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు పాఠాలు బోధించి ప్రశంసలు అందుకున్నారు. హెచ్ఎంగా తేజేష్, ఎంఈఓగా రాజేష్, డీఈఓగా నగేష్, ఉపాధ్యాయులుగా స్వాతి అక్షయ, స్నేహ, సుప్రియ, రోహిత్, ఇస్మాయిల్, కార్తీక్, పవన్, అభిషేక్, షైబాజ్ విధులు నిర్వహించి పాఠాలు బోధించారు.


స్వయం పరిపాలనలో పాల్గొన్న విద్యార్థులు